క్లుప్తంగా

జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో కో–ఎడ్యుకేషన్



జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి కో–ఎడ్యుకేషన్ అమలు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల స్థాపించినప్పటి నుంచి బాలురకు మాత్రమే అడ్మిషన్లతో పాటు, హాస్టల్ సదుపాయం కల్పించారన్నారు. ఈ ఏడాది నుంచి బాలికలకూ ప్రవేశం ఉందని, డే స్కాలర్స్‌కు మాత్రమేనన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినులు ఈ నెల 21 నుంచి నిర్వహించే పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఎంపిక చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

కడియం: మండలంలోని దుళ్ల గ్రామంలో ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రవణా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పూర్ణాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దఎత్తున భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు.

సామాజిక సేవ అందరి బాధ్యత



రంగారావును సత్కరిస్తున్న ప్రముఖులు

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ సమాజ సేవను బాధ్యతగా భావించాలని మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు అన్నారు. స్థానిక సదనం పాఠశాలలో ఆదివారం ఆయన జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, సమాజ సేవలోనే ఎక్కువగా గడిపిన వ్యక్తి మాటూరి రంగారావు అని కొనియాడారు. ఇన్నేళ్ల తన సుదీర్ఘ జీవన ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా రంగారావు పంచుకున్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా, ప్రముఖులు శెట్టి జగదీష్, మద్ది నారాయణరావు, బ్రింగుమళ్ల నారాయణ, బుడ్డిగ రాదా, కాశీ నవీన్, మాజీ కార్పొరేటర్ ఇన్నమూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచి దిగుబడికి మట్టి పరీక్షలు

రాజానగరం: పంటల్లో పోషక లోపాలను గుర్తించి, వాటి నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో ఉన్న జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా వారం రోజులు జరుగుతున్న శిక్షణా తరగతులు ఆదివారం కొనసాగాయి. మొక్కల్లో పోషణ మూలకాల లోపం–నివారణ అనే అంశంపై శిక్షణ జరిగింది. పంటల్లో పోషక లోపం వల్ల కలిగే నష్టాలు, వాటిని గుర్తించే విధానం, నివారణా చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

సినిమాలు

శ్యామల	: థగ్ లైఫ్
సూర్యమినీ	: బల్లెరినా
సూర్యప్యాలెస్	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
స్వామి	: ది హంటర్, శ్రీశ్రీశ్రీ రాజావారు
శివజ్యోతి	: కట్టప్ప జడ్జిమెంట్, పాపా(ఓ నాన్నా)
అనుశ్రీ	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
రాజా	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
ఊర్వశి	: అందాల రాక్షసి
మేనక	: శుభం, పాడేరు 12వ మైలు
రంభ	: ఫైనల్ డెస్టినేషన్
అప్సర	: సింగిల్
అశోక	: భైరవం
నామవరం	
వీఎస్ మహల్	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
కడియం	
వెంకటసూర్య	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్



నల్లమందు సందులో తిష్ట వేసిన పశువులు



దేవీచౌక్ ఏరియాలో నడి రోడ్డుపై ఇలా..

నిషేధమా.. ఎక్కడ..?

- నగరంలో విచ్చలవిడిగా పశువుల సంచారం
- పట్టించుకోని నగరపాలక యంత్రాంగం
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



పశువులను వ్యాన్‌లో సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారు. పశువుల యజమానులు ఉదయం, సాయంత్రం సమయాల్లో పాలు తీశాక.. ఆ జీవాలను రోడ్లపైకి వదిలివేయడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరంలో బహిరంగంగా పశువులు సంచరించడంపై నిషేధం ఉన్నప్పటికీ.. సంబంధిత అధికారులు ఆ దిశంగా దృష్టి పెట్టకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ గత కమిషనర్ దినేష్‌కుమార్ హయాంలో ఆవులను పోషించుకునేందుకు జైన్ సేవా సంస్థకు రాజమహేంద్రవరం సమీపంలోని రాజనగరం నియోజకవర్గంలో ఉన్న బొబ్బిల్లంక గ్రామంలో ఐదు ఎకరాల భూమిని అప్పగించారు. నగరంలో బహిరంగంగా తిరిగే పశువులను సేకరించి, వాటికి అవసరమైన ఆహారాన్ని అందించి, వాటిని సంరక్షించేందుకు జైన్ సేవా సమితి ముందుకు రావడంతో నగరపాలక సంస్థ ఈ మేరకు చర్యలు చేపట్టింది. అయినప్పటికీ ఇటీవల కాలంలో నగరంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులపై ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో, రేయింబవళ్లు తేడా లేకుండా పశువులు రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.

ప్రమాదాలకు కారణం

యథేచ్ఛగా సంచరిస్తున్న పశువులతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి, గాయాల పాలవుతున్నారు. పశువులను నిర్లక్ష్యంగా రోడ్లపైకి వదిలివేసే యజమానులపై చర్యలు చేపట్టి, జరిమానాలు విధించాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుండడంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో సుమారు వెయ్యి పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నట్లు సమాచారం. పశువులు గుంపులుగా సంచరిస్తూ.. పాదచారులపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలూ తరచూ సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఈ సమస్యపై దృష్టి సారించి ప్రమాదాలను నివారించాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు నిల్

గతంలో నగరపాలక సంస్థ శానిటరీ సిబ్బంది నగరంలో విచ్చలవిడిగా సంచరించే పశువులను స్వాధీన పర్చుకుని, బొబ్బిల్లంకలోని పశువుల సంరక్షణ కేంద్రానికి తరలించేవారు. ప్రస్తుతం అటువంటి చర్యలేమీ కానరావడం లేదు. నగరంలో పశువుల బహిరంగ సంచారంపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధులు ప్రబలే అవకాశం



పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ, ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను విసర్జించడం వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. నగరపాలక సంస్థ అధికారులు వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది. వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టే కార్యక్రమంలో భాగంగా పశువుల యజమానులు వాటిని ఇంటి వద్దే సంరక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కె.యుక్తిక, వైద్యురాలు

రాత్రివేళ ఎక్కువ ప్రమాదాలు



పశువుల బహిరంగ సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరంలో పశువులు విచ్చలవిడిగా సంచరించడం వల్ల రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనల్లో పలువురు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పశువుల బహిరంగ సంచారంపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– బీవీఎస్ఎల్‌పీ రెడ్డి, ఉద్యోగి

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల కోసం సోమ, మంగళవారాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సుబ్బారావు నగర్, లాలాచెరువులో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాతేరులోని దాసరినగర్, పంచాయతీ ప్రాంతం, సుబ్బారావుపేట, దేవాంగుల వీధి, సీటీఆర్ఐ రోడ్, జీఎస్ఆర్ ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందని చెప్పారు. మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతంపేట, కోటిలింగాలపేట, ఎన్టీఆర్ కాలనీ, ఈఎస్ఐ ఆసుపత్రి పరిసరాలు, టీచర్స్‌కాలనీ, మూలగొయ్యి, రామాలయం ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామలా థియేటర్, పెద్దాడవారి వీధి, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, గోదావరి గట్టు, మూడు గుళ్ల వీధి, ఉడిపి అక్షయ వీధి, హోటల్ ఫుడ్‌ఎక్స్, ఆచంటవారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి వీరభద్రనగర్ శాంతిపురం బీసీకాలనీలో పేకాట ఆడుతున్న ఏడుగురిని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తన సిబ్బందితో కలిసి ఆదివారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,200 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ధవళేశ్వరం: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా శిక్షణ దోహదం చేస్తుందని యోగా గురువు తలాటం సూర్యప్రకాశరావుఅన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురితో ఆయన యోగాసనాలు వేయించారు.



గౌతమ ఘాట్ వద్ద గోదావరిలో దర్శనమిస్తున్న నాచు

కాలు జారితే.. ఘాటు దెబ్బలే..



గౌతమ ఘాట్‌లో నాచు పట్టిన మెట్లు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఓ వైపు గోదావరి పుష్కరాలంటూ హడావుడి చేస్తున్న నగరపాలక యంత్రాంగం.. గోదావరిలో అనేక ఘాట్ల వద్ద కనిపిస్తున్న నాచు సమస్యపై కనీస దృష్టి సారించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లో మెట్లపై పట్టిన నాచుతో గోదావరిలో స్నానమాచరించే భక్తులతో పాటు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌లో మెట్లపై పూర్తిగా నాచు పట్టడంతో స్నానమాచరించేందుకు వెళ్లినప్పుడు కాలుజారి పడిపోతున్నారు. అంతేకాకుండా గోదావరిలో ఘాట్ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నాచు దర్శనమివ్వడంతో భక్తులు, పర్యాటకులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ఘాట్‌లో నాచు లేకుండా, గోదావరిలో ఉన్న నాచును తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ వీర్రాజుకు మాతృ వియోగం



ఆకుల ఈశ్వరమ్మ (ఫైల్)



ఆకులను పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా



దానవాయిపేటలో వీర్రాజును పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి, రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ(96) ఆదివారం దివంగతులయ్యారు. ఈమె ప్రముఖ పండ్ల వ్యాపారి దివంగత ఆకుల బాపిరాజు సతీమణి. ఆమెకు ముగ్గురు కుమారులు ఆకుల వీర్రాజు, ఆకుల గంగాధర్‌రావు, ఆకుల కృష్ణార్జునరావు ఉన్నారు. స్థానిక దానవాయిపేటలోని ఆకుల వీర్రాజు స్వగృహంలో ఈశ్వరమ్మ భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ చాంబర్ అధ్యక్షులు అశోక్‌కుమార్ జైన్, లక్ష్మీనారాయణ జవ్వార్, నందెపు శ్రీనివాస్, సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల బాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ బిల్డర్ ఆకుల చక్రవర్తి, మాజీ కార్పొరేటర్లు మింది నాగేంద్ర, ఇసుకపల్లి శ్రీనివాస్, మంచాల బాబ్జి, కేవైఎన్ బాబు, కాంగ్రెస్ నాయకులు అంకం గోపి, రామినేడి మురళి, జిల్లా టీటీ సంఘ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కడియం మండల వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ ఈలి గోపాలరావు, రాజమండ్రి అర్బన్, రూరల్ వైఎస్సార్ సీపీ నేతలు, లెమన్ మర్చంట్, ఫ్రూట్ మర్చంట్ సంఘాల సభ్యులు, నగర కాపు సంఘం, ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం ఆకుల వీర్రాజును, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ఇన్నీసుపేట కైలాసభూమిలో ఈశ్వరమ్మ భౌతికకాయానికి చిన్న కుమారుడు కృష్ణార్జునరావు అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని, ఆకుల వీర్రాజు కుటుంబాన్ని పరామర్శించారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఆకాశపు స్వామిని సత్కరిస్తున్న టైలర్లు

సీటీఆర్ఐ: ప్రస్తుతం టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి హామీ ఇచ్చారు. ఫెడరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆయనకు ఆదివారం రాజమండ్రిలో జిల్లా టైలర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు పి.వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలు, జిల్లా ఫెడరేషన్ సభ్యులు ఈ కార్యక్రమానికి సారథ్యం వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, టైలర్ల సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని కోరారు. వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడం వల్ల అపోహలకు దారి తీస్తుందన్నారు. ఫెడరేషన్ స్థాయిలో పరిష్కరించాల్సినవి తమవంతుగా చేస్తామని, మిగతావి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

తదనంతర వీలునామా శ్రేయస్కరం



గుర్తింపు కార్డు ఇస్తున్న సెక్రటరీ శ్రీలక్ష్మి



వృద్ధులతో ర్యాలీ నిర్వహిస్తున్న గుబ్బల రాంబాబు

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: ఇటీవలి కాలంలో కుటుంబ బాంధవ్యాల్లో వచ్చిన మార్పుల దృష్ట్యా వృద్ధులు నిరాదరణకు, వేధింపులకు గురవుతున్నారని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థికాంశాల్లో ప్రేమానురాగాలకు అతీతంగా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అన్నారు. ఆస్తిపాస్తులు కూడా తమ తదనంతరం మాత్రమే పిల్లలకు చెందేలా వీలునామా రాయాలని సూచించారు. స్థానిక ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్కులోని డేకేర్ భవనంలో సీనియర్ సిటిజన్ల ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, తల్లిదండ్రులు, పిల్లలకు మంచిచెడులపై, కుటుంబ బాంధవ్యాలు, ప్రేమానురాగాల విలువలను నేర్పించాలన్నారు. అందరికీ న్యాయం అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన న్యాయ సేవాధికార సంస్థ వృద్ధులు, మహిళలు, 18 ఏళ్లలోపు పిల్లలు, రూ.3 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి ఉచిత న్యాయం అందేలా దోహదపడుతుందన్నారు. అర్హత ఉన్నవారికి న్యాయపరంగా వచ్చే పెన్షన్, పట్టాలు అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి కూడా తమను సంప్రదించవచ్చన్నారు.

వృద్ధులపై వేధింపులు నివారించాలి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో వృద్ధులపై పెరుగుతున్న వేధింపులు అరికట్టాలని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. ఆదివారం నగరంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా దుర్గమ్మ గుడి ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వృద్ధులపై జరుగుతున్న వేధింపులు అరికట్టాలని, వృద్ధుల రక్షణకు చట్టాలు కఠినంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. రాంబాబు మాట్లాడుతూ, సమాజంలో ఆస్తులు, డబ్బు కోసం వృద్ధులపై వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సంపాదనలేని కుటుంబ సభ్యులు పేదరికం వల్ల వృద్ధులను నిర్లక్ష్యంగా ఇంటి నుంచి గెంటేస్తున్నారని చెప్పారు.



కూటి కోసం.. ఈ పల్టీ వేయాల్సిందే..



జీవన భారం కంటే.. గుండెపై ఇది బరువే కాదు



నిప్పులు కక్కితేనే.. కడుపు నిండేది



ఈ నిప్పుల గుండం మాకు ఏపాటిది!

ఆట పండాలి.. కడుపు నిండాలి

బిక్కవోలు: కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. చేసే ఏ పనైనా కడుపు నింపుకోవడానికే. దీనికోసం ప్రాణాలను కూడా పణంగా పెట్టి.. జనాన్ని ఆకట్టుకునేందుకు ప్రదర్శనలు ఇస్తుంటారు కొందరు. ఈ కోవలోకే వస్తారు మాల మాస్టీలు. మండలంలోని ఊలపల్లి గ్రామంలో మాల మాస్టీలు ఆదివారం ప్రదర్శించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొరుకుండ గ్రామం నుంచి వచ్చిన వీరు చేసిన అద్భుత విన్యాసాలు చూపరులను గగుర్పాటు కలిగించాయి. నిప్పుగోళం నుంచి అవలీలగా దూకడం, అనితరసాధ్యమైన బరువులను అవలీలగా ఒంటిచేత్తో ఎత్తడం, వంద కేజీల ఇనుప రాళ్లను గుండెలపై వేసుకోవడం, నోటి నుంచి మంటలను ఊదడం, గొర్రెపోతుతో గుండెపై ఢీకొట్టించడం వంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. వీరు బుర్ర కథ కూడా ప్రదర్శించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర, మహిళా విద్యకు సావిత్రీబాయి పూలే సాగించిన పోరాటాన్ని చక్కగా విశదీకరించారు.